# యాత్రాఫలం

-టి.పి.హేమమాలిని



**ఆదివారం. హోలీ డే కాస్తా హాలిడేగా రూపాంతరం చెంది దేవుడిచ్చిన సెలవు దినంగా మారింది.**

**రెండుసార్లు స్ట్రాంగ్ కాఫీ సేవించి, న్యూస్ పేపర్ ఆమూలాగ్రం చదివే శాక భార్యామణి పోరగా బాత్‌రూంలో దూరాను.**

చవులూరించబోయే రుచికరమైన ఫలాహారాన్ని తలుచుకుంటూ స్నానం ముగించి, రోజులానే దేవుడి దగ్గర దీపం వెలిగించాను. డైనింగ్ టేబుల్' దగ్గరకు రాగానే వేడివేడి పూరీలు, కుర్మా వడ్డించింది నా శ్రీమతి.

అంతలోనే దిగబడ్డాడు సుందరం. ప్రతి ఆదివారం కచ్చితంగా మా ఇంటి కొస్తాడు. దిగబడ్డాడు అనే పద ప్రయోగం సుందరం నాకు అక్కరకు రాని చుట్టమో, అక్కర లేని పక్కమో అని కాదు. అత్యంత సన్నిహితుడు, ఆప్తుడు. సుందరాన్ని ఎన్ని తిట్టినా తిట్టే హక్కు, తిట్టించుకునే బాధ్యతా నాకే ఉన్నాయి.

నా గురించి చెప్పాలంటే సుందరం గురించి చెప్పి తీరాలి. చిన్నప్పుడు దొంగతనంగా చీకటి గదిలో చేరి బీడీలు కాల్చిన నాటి నుండి నా ప్రియ మిత్రుడు.

తనకి కావలసినవి కూడా నా కోసం త్యాగం చేయగల స్వభావంతో మా స్నేహానికి పునాది వేశాడు.

మా బంధం విడదీయడం ఇష్టం లేనట్లు భగవంతుడు మాకు ఉద్యోగాలు కూడా ఒకేచోట ఏర్పరిచాడు.

ఇద్దరం ఇంకా సర్వీసుండగానే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాం. నా ఒక్కగానొక్క కొడుకు ప్రపంచమంతా పరుగెత్తినట్లే సాఫ్ట్‌వేర్ రంగం వైపు దూసుకెళ్ళి ఇంజనీర్‌గా స్థిరపడ్డాడు హైదరాబాద్‌లో. ప్రస్తుతం ఆ కంపెనీ వాళ్ళు పంపగా ప్రాజెక్ట్ వర్క్‌కై స్టేట్స్ వెళ్ళాడు. సుందరం పిల్లలు ఇంకా చదువుకుంటున్నారు.

'రా అన్నయ్యా!' రక్త సంబంధంలో సావిత్రి అంత డెప్త్ ఉంది నా శ్రీమతి పిలిచిన పిలుపులో.

'నీ కుర్మా వాసన మా ఇంటి వరకూ వచ్చిందమ్మా!' అంటూ కుర్చీ లాక్కుని కూచున్నాడు.

'అవునవును. మా ఇల్లేమో ఎం.వి.పి. కాలనీలో. మీ ఇల్లు గోపాలపట్నంలో. కచ్చితంగా వచ్చే ఉంటుంది'

'మా చెల్లెలా! మజాకా!' అంటూ మాట్లాడుతూనే గబగబా రెండు పూరీలు తినేశాడు.

'అదిరిందమ్మా చెల్లెమ్మా! అద్భుతం!' అంటూ మరో ఆరు లాగించాడు.

'మంచి కాఫీ కొట్టమ్మా!' అంటూ హాల్లో సోఫాలో చేరాడు.

'నువ్వొక్కడివీ దిగబడకపోతే మా చెల్లెలిని తీసుకు రావచ్చు కదా!' అన్నాను.

'అనుకున్నాను. కానీ వాళ్ళ వదిన గారింట్లో ఏదో ఫంక్షనుంటే వెళ్ళింది. ఏంటి విశేషాలు?' మా పిచ్చాపాటీ మొదలైంది.

తల కింద చేతితో పాల కడలిపైన పద్మనాభుడిలా కనిపించాడు.

'విశేషాలంటే... నిన్న రాత్రే నాకో ఆలోచన వచ్చిందిరా! సంపూర్ణ భారతదేశ యాత్ర చేయాలని, అదీ సతీసమేతంగా!' చెప్పాను వాడితో.

'మంచిదేరా! కానీ ఏంటింత సడన్‌గా ఈ బుద్ధి పుట్టింది!' ఆశ్చర్యపోతూ అడిగాడు.

'ఏం లేదురా! ఎప్పుడెలా ఉంటామో తెలియడం లేదు ఈ రోజుల్లో. అందుకే ఈ మాత్రం ఓపికుండగానే దక్షిణాది శ్రీరంగం నుండి ఉత్తరాదిన వైష్ణోదేవి ఆలయం వరకు దర్శించుకోవాలని ఉంది. కేవలం తీర్థయాత్రలా కాకుండా భారతావని అందాలన్నీ చూడాలని నా ఆశ' నా కోరికను వెలిబుచ్చాను.

'మరి ప్రయాణపు ఏర్పాట్లు?'

'వాకబు చేశాను. మంచి ట్రావెల్ ఏజెన్సీ వాళ్ళని కలిశాను. అన్నీ వాళ్ళే చూసుకుంటారట భోజనంతో సహా. అందుకనే బయలుదేరదామనుకుంటున్నాను. ఇంకా మీ చెల్లికి కూడా చెప్పలేదు. నువ్వు, మా చెల్లెమ్మ కూడా రావచ్చు కదా!' అన్నాను.

'నీకంటే ఒక్కడే కొడుకు. వాడి బాధ్యత తీరిపోయింది కాబట్టి నువ్వు హాపీగా ఉన్నావు. నాకలా కాదుగా. అబ్బాయి సిఏ, అమ్మాయి ఎంబిఏ అవుతున్నాయి కదా! కనీసం ఆరు నెలలు పడుతుంది మళ్ళీ మనం రావాలంటే. అంతవరకూ పిల్లలకి ఇబ్బంది అవుతుంది. అయినా నీకు తెల్సు కదా! నేనో వెయ్యికాళ్ళ జెర్రిని. ఇక్కడ పన్లు ఉంటాయి నాకు. అందుకని ప్రతి దేవుడి దగ్గర నా గురించి ప్రార్థించు' అన్నాడు సుందరం.

నిజమే! నాకలాంటివన్నీ పెద్దగా ఇంట్రస్ట్ ఉండదు కానీ, సుందరానికి నలుగురితో పరిచయాలు పెంచుకోవాలన్నా, సంఘాలు, సమావేశాలన్నా ఇష్టం.

లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ అంటూ యాక్టివ్‌గా తిరుగుతాడు. కేవలం పేరు కోసమే కాకుండా నిజంగా సేవ చేసే ఉద్దేశం వాడిది. అందుకే మురికివాడలంటా, పేదవారిళ్ళంటా తిరిగి వారికేవో వస్తువులు ఇవ్వడం, బట్టలు సేకరించి ఇవ్వడం చేస్తుంటాడు.

నా దగ్గరకొచ్చి, వారి అవసరం నా కంట పడితేనే నేను సహాయం చేస్తాను. కానీ సుందరం ఎవరికి సహాయం అవసరమో తెలుసుకుని తనే వెళ్ళి చేస్తాడు. పెద్ద వాళ్లతో పరిచయాలు ఉన్నాయి.

కావలసిన వారికి సహాయం ఎలా చేస్తాడో, ఎవరికీ ఏ సాయం చేయని వారి దగ్గర నుండి కూడా పని చేయించుకోగల సామర్థ్యం ఉంది. స్థానిక రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర వాడిది. గతంలో వార్డ్ కౌన్సిలర్‌గా కూడా చేశాడు.

సరే! అవన్నీ పక్కన పెడితే నా ప్రయాణ సన్నాహాల్లో నేను పడ్డాను.

అన్ని ఏర్పాట్లు పూర్తయి మేం బయల్దేరే రోజు వచ్చింది.



మాకు సెండాఫ్ ఇవ్వడానికి వచ్చిన సుందరం ఫోన్ చేస్తుండమని, నాతో మాట్లాడకపోతే తనకు తోచదని చెప్పాడు.

కానీ ఆ షరతుకి మాత్రం ఒప్పుకోలేదు నేను.

మేం యాత్రల నుండి తిరిగొచ్చాక వివరాలు, విశేషాలు చెప్తానని కచ్చితంగా చెప్పేశాను. నా అనుభవాలు వాడితో ముఖాముఖి పంచుకోవాలని నా అభిలాష.

హాయిగా సెల్ మోతలు లేని ప్రశాంత ప్రయాణం కావాలని సెల్ ఇంట్లోనే వదిలేశాను.

మా బస్సు కదిలింది. కళ్లు మసకబారాయి చెమరింపుతో. సుందరాన్ని చూసేందుకు ఆరు నెలలు పడుతుందన్న బెంగ మొదలైంది అప్పుడే.

★ ★ ★

భారతదేశపు చిట్టచివరి పాయింట్ కన్యాకుమారి నుండి మొదలైంది మా యాత్ర. కన్యాకుమారిలో బీచ్‌ల అందాలు, దర్శనీయ స్థలాలు చూశాం. కేరళ బ్యాక్ వాటర్స్, కొబ్బరి తోటలు, చర్చిలు, పుణ్యక్షేత్రాలు, ఆలయాలు గల రాష్ట్రంగా ప్రసిద్ధి కెక్కిన తమిళనాడు అంతా తిరిగాం. కర్ణాటకలో కావేరీ అందాలు, శ్రీరంగంలో రంగనాథుడి సౌందర్యం, శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్లమ్మ అందం ముగ్ధుల్ని చేశాయి.

బస్సులో ఉన్న వాళ్లందరూ స్నేహపాత్రులయ్యారు.

మైసూర్ మహారాజ కోట, బృందావన్ గార్డెన్స్ చూశాం. చందనంతో చేసిన అనేక వస్తువులు కొంది శ్రీమతి.

తర్వాత హైదరాబాద్ చేరాం. మేం చాలాసార్లు చూసినందువల్ల ఆ నాలుగు రోజులు రెస్ట్ తీసుకున్నాం.

ఆ తర్వాత మా గమ్యం ఒరిస్సా పూరీ జగన్నాథుడి దర్శనం, బీచ్ సందర్శనం, కోణార్క శిల్ప సౌందర్యం, సాక్షి గోపాలం చూశాం.

కలకత్తా కాళి దర్శనం, రామకృష్ణ మిషన్ చూశాక, షిర్డీ సాయి ఆశీర్వాదం అయ్యాక, ద్వారకలో కృష్ణుడు సంచరించిన ప్రదేశాలు కళ్ళారా చూశాం. పింక్ సిటీ జైపూర్ కోటలు, పంజాబ్‌లో స్వర్ణ దేవాలయం, ఉత్తర ప్రదేశ్‌లో మధురలో శ్రీకృష్ణ జన్మస్థానం, ఆగ్రాలో తాజ్ మహల్ సోయగాలు వీక్షించాం. అలహాబాద్‌లో త్రివేణి సంగమం చూశాం. వారణాసిలో పవిత్ర గంగానదిలో నా పితృదేవతలకు తర్పణాలు వదిలాను. బద్రీనాథ్, కేదార్‌నాథ్ దర్శించాం. ఈశాన్య రాష్ట్రాలలో గిరిజనుల జీవనాన్ని, జీవితాల్ని చూశాం. ఆఖరుగా కాశ్మీర్ అందాలను తనివితీరా చూశాం. మట్టి పిడతల్లోని చాయ్ తాగాం. విసుగొచ్చేలా ఆపిల్స్ తిన్నాం.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించుకున్నాం.

మా తిరుగు ప్రయాణం మొదలైంది.

ఒక చిత్రమైన అనుభూతితో కూడిన తృప్తి మిగిలింది.

★ ★ ★

గత ఆరు నెలలుగా మా ఊరితో, ఇంటితో సంబంధం తెగిపోయిన నాకు ప్రాణం లేచొచ్చినట్లయింది.

అన్నాళ్ళుగా ఇంటిని భద్రంగా చూసుకున్న పక్కింటి వాళ్ళకు కృతజ్ఞతలు చెప్పాను.

ఎప్పుడెప్పుడు సుందరాన్ని చూస్తానా అని ఉంది. వెంటనే సుందరానికి ఫోన్ చేశాను ఉన్నపళంగా రమ్మని.

సుందరంతో యాత్రా విశేషాలు పంచుకోవాలని ఆరాటంగా ఉంది. తమిళనాట సాంబార్ రుచి, ఒరిస్సాలోని పూరీ కాజా చవి, కలకత్తా రసగుల్లా పసందు, పంజాబ్ ఛోలే మజా అన్నీ... అన్నీ... చెప్పాలి.

ఫోన్‌లో ఎప్పటికప్పుడు చెప్పేస్తే ఈ ఆనందం ఉండేది కాదు. ఇప్పుడు ఎడతెరిపి లేకుండా ముచ్చటించుకోవచ్చు.

సుందరానికిష్టమైన ఫలహారం సిద్ధం చేయమని చెప్పాను మా ఆవిడకి.

ఇంతలో ఇంటి ముందు వెహికల్స్ ఆగిన చప్పుడు. లేచి చూడబోతుండగా ముందుగా ఇద్దరు సాయుధులు వచ్చారు. వారి చేతిలో గన్స్. గన్‌మెన్‌గా గుర్తించాను వారిని. అర్థంకాలేదు.

'ఎవరు మీ...?' నా ప్రశ్న బయటకు రాకుండానే సుందరం లోపలికొచ్చాడు.

'సుందరం!' ఆప్యాయంగా కౌగిలించుకోబోయాను. అదే టైంలో వాడూ చేతులు చాచాడు. ఇద్దరం బంధనంలో ఇరుక్కున్నాం.

'ఇంతకీ వీళ్లెవర్రా?' కూచున్నాక అడిగాను అయోమయంగా.

'మీరు వెళ్లండి' ఆర్డర్స్ పాస్ చేశాడు. వాళ్ళు బయటకు వెళ్ళారు.

'వీళ్లు నా బాడీగార్డ్స్!' తాపీగా చెప్పాడు.

పొట్ట పగిలేలా నవ్వాను. కళ్లంట నీళ్లు తిరిగి కనపడనంతగా నవ్వుతూనే ఉన్నాను.

'నీకెందుకురా బాడీగార్డ్స్!' ఇంకా నవ్వాగలేదు.

'అఘోరించావులే! నేనిప్పుడు నీ స్నేహితుడు మామూలు సుందరాన్ని అనుకున్నావా?'

'ఆ... కాక... ప్రైం మినిస్టర్ ఆఫ్ ఇండియావా?'

'ఒరే! ఒరే! నీ చిన్ననాటి చెలికాడు ఇప్పుడు ఎంఎల్‌ఏ సుందరం అయ్యాడురా బడుద్దాయి' దర్జాగా దర్పంగా చెప్పాడు.

సంభ్రమంతో నా కళ్లు పెద్దవయ్యాయి.

కాఫీ తెస్తున్న మా సుందరంగాడి చెల్లెమ్మ నిలబడిపోయిందలాగే.

'అన్నయ్యా! నువ్వు... నువ్వు...'

'అవునమ్మా! ఇప్పుడు నువ్వు ఈ అష్టరాల్‌గాడి పెళ్ళానివి కాదు. ఎంఎల్‌ఏ మరియు కాబోయే మంత్రిగారి చెల్లెలివి' అతిశయం ఉట్టిపడింది.

'అసలిదంతా ఎలా జరిగిందిరా? మన రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?' అడిగాను ఆశ్చర్యంగా.



**గత ఆరు నెలలుగా మా ఊరితో, ఇంటితో సంబంధం తెగిపోయిన నాకు ప్రాణం లేచొచ్చినట్లయింది. అన్నాళ్ళుగా ఇంటిని భద్రంగా చూసుకున్న పక్కింటి వాళ్ళకు కృతజ్ఞతలు చెప్పాను.**

'అయ్యో రామ! యాత్రల్లో పడి న్యూస్ పేపర్ కూడా చూడలేదా ఏం? మీరు వెళ్ళగానే అధిష్ఠానంలో సంక్షోభం ఏర్పడింది. ప్రభుత్వం గద్దె దిగాల్సిందేనన్నాయి ప్రతిపక్షాలు. ఫలితంగా మధ్యంతరం వచ్చిపడింది' వివరించాడు.

'అయితే నీకు పోటీ చేయాలన్న కోరిక ఎలా కలిగింది?'

'నీకు తెలుసుగా! నలుగురిలో నాకు పలుకుబడి ఉంది. రాజకీయాల్లో తిరిగాను. కౌన్సిలర్‌గా కూడా గెలిచానుగా రెండుసార్లు. కొత్త వాళ్ళకు టికెట్ ఇవ్వాలనుకున్న నాయకులు నాకిచ్చారు. అందుకే అందరూ వెన్నుతట్టగా ధైర్యంగా ఎంఎల్‌ఏగా పోటీ చేశాను'

'పోన్లేరా సుందరం! నువ్వు యాత్రలు చేయకపోయినా, నేను వెళ్ళిన ప్రతి చోటా నీ గురించి దణ్ణం పెట్టుకున్నాను మన సారా. అది వృథా పోలేదు. చూశావా? ఎంత మంచి ఫలితాన్నిచ్చాడో భగవంతుడు' ఆనందంగా చెప్పాను.

'నా ప్రయత్నానికి తోడు భగవంతుడి కరుణ, నా అదృష్టం కలిసొచ్చాయి. అది కాదనలేను కానీ, నేనూ యాత్ర చేశానురా కేశవా!' నాకు తెలియని కొత్త విషయం బయటపెట్టాడు.

ఈసారి ఆశ్చర్యపోవడం నా వంతయింది.

'మాతో రానన్నావు. నువ్వెప్పుడు వెళ్లావురా? పైగా ఎన్నికలు, ప్రచారం... ఎలా కుదిరింది? మన ఆంధ్రాలో ఉన్న క్షేత్రాలతో సరిపెట్టేశావా?' నా ఊహలు గుప్పించే ప్రశ్నలకి అడ్డు తగిలాడు.

'నేనే క్షేత్రాలకూ తీర్థయాత్ర చేయలేదురా!'

'మరి?'

'నేను చేసింది పాద యాత్ర. ఎన్నికల సందర్భంగా చేసిన పాదయాత్ర వల్ల ఓటరు దేవుళ్లు మెచ్చి ఇచ్చిన ఓటు అనే వరం నాకీ యోగాన్ని తెచ్చిపెట్టింది. అందుకే ఆ దేవుడికే నా వందనాలు. ఆ ఓటరు క్షేమమే నా లక్ష్యం' అన్నాడు సుందరం.

ఆశ్చర్యానందాలతో చేష్టలు దక్కాయి నాకు. సుందరం పరిధిలో సేవ బాగానే చేస్తాడన్న నమ్మకమూ ఉంది.

'రేపే ప్రమాణ స్వీకారం. రావడం మర్చిపోకు. కారు పంపిస్తా' భద్రత మధ్య కారెక్కుతూ చెప్పాడు. ★

## మంచు పావులతో చెస్



చెమటలు కక్కుకుంటూ, బుర్రలు వేడెక్కించుకుంటూ బల్లలపై చెస్ ఆడే బదులు ఆరుబయట రోడ్డుపై చెస్ ఆడితే ఎలా ఉంటుంది? మాస్కోలోని పుష్కినా స్క్వేర్‌లో జరిగిన హేమాహేమీల చెస్ పోటీలు జనానికి ఎంతో ఆనందం కలిగించిందట. ఎందుకంటే విశాలమైన బల్లలపై మంచుతోనే తయారు చేసిన పావులతో ఆడారు మరి. మంచుతో తయారు చేసినవి కనుక చెమటలు కక్కే ప్రసక్తే రాదు. అయితే తలపై చేతులు పెట్టుకుని కూర్చుంటే మాత్రం గుర్రాలు, ఏనుగులే కాదు, రాజు రాణిలు కూడా మాయమై పోతాయేమో!